క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తఅగ్రహారంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణానికి స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో ప్రహరీ నిర్మిస్తున్నట్టు చెప్పారు. పతివాడ రాజారావు, మహంతి లక్ష్మి,ముజీకీర్ మహ్మద్, దాలయ్య,అంగన్‌వాడీ వర్కర్ నాగమణి పాల్గొన్నారు.

భూరీసర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

వేపాడ: మండలంలోని బానాది, బి.టి.కె.రాజపురం రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి నిర్వహించనున్న సమగ్ర భూరీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ కె.ప్రసన్నకుమార్ కోరారు. బానాదిలో రైతులతో కలిసి గురువారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికే రీసర్వే చేపడుతున్నట్టు చెప్పారు. సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల ప్రారంభం



కొట్యాడలో బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని వేచలపువాని పాలెం,కొట్యాడ గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి చేతి పంపులను ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇటీవల 36 బోర్లు ఏర్పాటు చేశామన్నారు. కొట్యాడ సర్పంచ్ కొట్యాడ దేవి, నాయకులు మహేష్, శ్రీనివాసరావు,జగన్ పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురు ఎంపిక

గజపతినగరం: జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో పురిటిపెంటలోని ఓ ప్రైవేటు స్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులు బి.హనీష్‌కార్తీక్, ఐ.జోష్య, ఎం.వాసికాప్రియ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

గురుకులం సందర్శన



భోజనాలను పరిశీలిస్తున్న అధికారి పద్మజ

వేపాడ: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా గురుకులాల సమన్వయాధికారి టి.పద్మజ గురువారం సందర్శించారు. మరుగుదొడ్లను డార్మెంటరీ, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా, పాఠాలు బాగా బోధిస్తున్నారా లేదా అని విద్యార్థినులను ఆరా తీశారు. వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఆమె వెంట ఉన్నారు.

రూ.4 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం



కాలువ పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ శిరీష

చీపురుపల్లి: పట్టణంలోని అద్దూరివీధిలో రూ.4 లక్షలతో సీసీ కాలువ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష గురువారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతీ సచివాలయాలనికి రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని చెప్పారు. అద్దూరివీధిలో కాలువ పనులకు రూ.4 లక్షల 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులను కేటాయించినట్టుచెప్పారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, ముల్లు పైడిరాజు, కరణపు ఆది, కింతలి మధు, ముజీకీర్ మహ్మద్ పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు విత్తనాల సరఫరా

● రాయితీపై వరి విత్తనాల పంపిణీ



గంట్యాడ: పెదవేమలిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ భవాని, సర్పంచ్ పాపునాయుడు



చీపురుపల్లి: విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు



గుర్ల: విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకుడు అప్పలనాయుడు



గజపతినగరం రూరల్: కాలంరాజుపేటలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తు న్నామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ అన్నా రు. పట్టణంలోని సచివాలయం–4 పరిధి రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే) వద్ద రైతులకు గురువారం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు సమయానికి విత్తనా లు అందేవి కాదని, మండల కేంద్రానికి రోజూ వచ్చి వ్యవసాయ కార్యాలయం వద్ద క్యూలో పడిగాపులు కాసిన సంఘటనలు అందరికీ గుర్తున్నాయని చెప్పారు. సర్పంచ్ మంగళగిరి సుధారాణి, టెలీకాం బోర్డు సభ్యుడు ఇప్పిలి తిరుమల, ఆ పార్టీ నాయకులు పతివాడ రాజారావు, గిరిడ రాందాసు, ముల్లు పైడిరాజు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

గజపతినగరం రూరల్: రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని కాలంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు అన్నారు. గ్రామంలోని ఆర్బీకేలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. సచివాలయ కార్యదర్శి, ఆర్బీకే సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి

గంట్యాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు అన్నారు. పెదవేమలిలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను రైతులకు గురువారం పంపిణీ చేశారు. వీఏఏ పి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల సేవలను వినియోగించుకోండి

గుర్ల: రైతులకు ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందిస్తోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్ము అప్పలనాయుడు రైతులకు సూచించారు. చింతపల్లిపేట రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే)లో రైతులకు రాయితీపై వరి విత్తనాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

కౌలు కార్డుల జారీలో లక్ష్యాలు చేరుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ నాగభూషణం

గంట్యాడ: మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో లక్ష్యాలను చేరుకోవాలని, అర్హత ఉన్న వారందరికీ కౌలు కార్డులు అందించాలని ఏడీఏ నాగభూషణం సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండలంలోని వీఆర్ఓలు, వీఏఏలతో గురువారం సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 839 కౌలు కార్డులు మంజూరు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇంతవరకు 176 మంజూరు చేశామని చెప్పారు. మిగతావారికి కూడా కార్డులు మంజూరు చేయాలని సూచించారు. కౌలు కార్డులు ఉన్న రైతులు ప్రభుత్వ రాయితీలు పొందవచ్చని తెలిపారు. ఎకరానికి పైగా భూమి కౌలు చేసినట్లయితే వైఎస్సార్ రైతు భరోసా పొందవచ్చని, ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతింటే నష్ట పరిహారం కూడా పొందవచ్చని, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పీఎంకిసాన్ పథకానికి సంబంధించి మండలంలో ఇంకా 400 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని, వారంతా ఈనెలఖారులోగా చేయించుకోవాలన్నారు. 2021 లో ధాన్యం విక్రయించిన రైతులకు రవాణా చార్జీలు, కలాసీల కూలి డబ్బులను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. తహసీల్దార్ ప్రసన్న రాఘవ, ఏఓ బూసే శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హత ఉన్న వారందరికీ జాబ్‌కార్డులు

● ఉపాధి పీడీ ఉమా పరమేశ్వరి

గజపతినగరం రూరల్: అర్హత ఉన్న వారందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని ఉపాధి పీడీ ఉమా పరమేశ్వరి అన్నారు. గుమడాం గ్రామానికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ మీద వచ్చిన ఆరోపణల మేరకు గురువారం ఆమె గ్రామంలో పర్యటించి వేతనదారులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన దాదాపు 38 మందికి కంప్యూటర్ ఆపరేటర్ విజయలక్ష్మి పనులు ఇవ్వడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ పేమెంట్స్ ఉన్నాయని దాదాపు మూడు సంవత్సరాలుగా పనులు కల్పించడం లేదని, అలాగే జాబ్‌కార్డులు అడిగినా స్ప్లిటింగ్ ఆప్షన్ లేదంటూ కంప్యూటర్ ఆపరేటర్ వేధిస్తోందని పీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పీడీ కంప్యూటర్ ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయించారు. పనులు కూడా కల్పించాలని ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పీడీ చెప్పారు.

కళ్లేపల్లి డ్వాక్రా సభ్యులకు అండగా ఉంటాం

● ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

లక్కవరపుకోట: నిధుల దారి మళ్లింపుతో నష్టపోయిన మండలంలోని కళ్లేపల్లి గ్రామ డ్వాక్రా సంఘాల మహిళలకు ఐద్వా సంఘం అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బలివాడ ప్రభావతి స్పష్టం చేశారు. కళ్లేపల్లి డ్వాక్రా సంఘాల బుక్ కీపర్ గోకేడ మహేశ్వరి హత్య కేసులో ఆదే గ్రామానికి చెందిన మరో బుక్ కీపర్ గాడి చినతల్లి జైలుకెళ్లిన విషయం తెలిసిందే. గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో ఐద్వా సంఘం నాయకులు గురువారం సమావేశమయ్యారు. ప్రభావతి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు చెందిన సుమారు రూ.70లక్షలను బ్యాంక్, వెలుగు అధికారుల సహాయంతో బుక్‌కీపర్ గాడి చిన్నతల్లి దారి మళ్లించారని. దీంతో డ్వాక్రా సభ్యులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. బుక్‌కీపర్ మహేశ్వరి హత్య జరిగిన మరుసటి రోజే బ్యాంక్ అధికారులు హడావుడిగా అప్పులు తీర్చాలని డ్వాక్రా మహిళలకు నోటీసులు జారీ చేయడం సరికాదని ఆమె మండిపడ్డారు. ఈ ఆర్థిక అవకతవకలపై ధర్యాప్తు అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఆమె ఆక్షేపించారు. ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా నేటి వరకు ఎవరిపైనా వేటు పడకపోవడం దారుణమన్నారు. నిందుతురాలు చిన్నతల్లిపై ఇప్పటికే 302 సెక్షన్‌పై కేసును పోలీస్‌లు నమోదు చేశారని 420 కేసు కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.రమణమ్మ,విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి,కరుణ పాల్గొన్నారు.

హెచ్‌ఎంలతో సమీక్ష



మాట్లాడుతున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ బాలభాస్కరరావు స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, లెసెన్ ప్లాన్స్, వర్కుబుక్స్ దిద్దడం, అకడమిక్ ప్లాన్స్, నాడు–నేడు పనులపై సూచనలు చేశారు. కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు, పాత విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు.

సంక్షిప్తంగా...

పక్కాగా 'ఫ్యామిలీ డాక్టర్'



మంగళపాలెంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ

వేపాడ/ కొత్తవలస: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని వేపాడ, కొత్తవలస ఎంపీడీఓలు బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్, వై.పద్మజ వైద్యాధికారులకు సూచించారు. వేపాడ మండలం జగ్గయ్యపేట, కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీడీఓలు పర్యవేక్షించారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులాహ్వానం

కొత్తవలస: మండలంలోని అర్దన్నపాలెం గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో 7,8,9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా స్కూల్ పనివేళల్లో సంప్రదించి దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు. స్టడీ, రేషన్, ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం జెరాక్స్‌లను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

బొండపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న కాంటిజెంట్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంటిజెంట్ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీతల దుర్గారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న దుర్గారావును ఇటీవల విజయవాడలో జరిగిన మెడికల్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సులో కాంటిజెంట్ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కాంటిజెంట్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన చెప్పారు.

రూ.44 లక్షలతో పశువుల దాణా యూనిట్

వేపాడ: మండల సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘ సభ్యుల సభ్యత్వ రుసుంతో పశువుల ధాణా యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ఐకేపీ ఏపీఎం ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల భాగస్వామ్యంతో ఈ యూనిట్ ఏర్పాటు చేసి, వచ్చిన లాభాన్ని మహిళలకు అందజేయనున్నట్లు చెప్పారు. మండలంలో 1,277 సంఘాల్లో 14,402 మంది సభ్యులు ఉన్నారని, వీరి నుంచి రూ.44.64 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 3,904 మంది సభ్యుల నుంచి రూ.12.10 లక్షలు వసూలు అయ్యిందని తెలిపారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఫీడ్ మిక్సింగ్‌యూనిట్ నెలకొల్పేందుకు ప్రతీ సభ్యురాలు నుంచి రూ.310 వసూలు చేస్తున్నట్లు చెప్పారు.

ప్లేట్లు, విద్యా సామగ్రి పంపిణీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం, అర్తమూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని 170 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాల కోసం స్టీల్‌కంచాలు, జామెట్రీ బాక్సులు,ఇతర విద్యాసామగ్రిని గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు పొన్నాడ సూర్యనారాయణ గురువారం పంపిణీ చేశారు. తన మనమురాలు పుట్టినరోజు సందర్భంగా ఈ సేవాకార్యక్రమాలు నిర్వహించినట్లు దాత తెలిపారు. సర్పంచ్ పొన్నాడ కుమార్,ఎంపీటీసీ పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మడంల కన్వీనర్ రవికుమార్

జామి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ అన్నారు. విజినిగిరిలో గృహసారథులు, వలంటీర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వెళ్లి సమస్యలపై జల్లెడ పట్టాలన్నారు. జేసీఎస్ కన్వీనర్ శీర చందునాయుడు, విజినిగిరి,తానవరం సర్పంచ్‌లు కిలారి సూర్యారావు,అప్పలనాయుడు పాల్గొన్నారు.


గుండె వైద్య శిబిరం

లక్కవరపుకోట: మండలంలోని గోల్డుస్టార్ జంక్షన్ సమీపంలో పాల్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గుండె సమస్యలకు సంబంధించిన వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన మెడికవర్ హాస్పిటల్ వైద్యులు 75 మందికి తనిఖీలు చేశారు. ఉచిత ఈ శిబిరాన్ని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ప్రారంభించారు.

నేర ప్రవృత్తి మార్చుకోకుంటే చర్యలు

బొండపల్లి: వివిధ కేసుల్లో ఉన్నవారు తమ నేర ప్రవృత్తిని మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని గజపతినగరం సీఐ ఎల్.అప్పల నాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులు ఉన్న 48 మందికి గురువారం కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడు తూ గతంలో పోలీసు రికార్డుల్లో ఉన్న వారంతా కూడా మళ్లీ తమ పాత పద్ధతిలో నడిస్తే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తామని చెప్పారు.ఎస్ఐ ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన



వంటకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాలను బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు గురువారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రోజూ విద్యార్థులకు భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వైఎస్సార్ పశుబీమా..పాడిరైతుకు ధీమా

గజపతినగరం రూరల్: పశువులకు వైఎస్సార్ పశు బీమా చేయించుకున్న పాడి రైతులు ధీమాగా ఉండవచ్చని పశుసంవర్ధక శాఖ జిల్లా పథక సంచాలకులు విశ్వేశ్వరరావు తెలిపారు. గంగచోళ్లపెంట గ్రామంలో పాడి రైతులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో ఆవులు, గేదెలు, మూగ జీవాలు మృతి చెందితే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని చెప్పారు. పశువులలో తరచుగా వస్తున్న గాలికుంటు వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉప సంచాలకులు వై.వి.రమణ, ఎస్.చంద్రశేఖర్, సర్పంచ్ సంగమయ్య, పశువైద్యాధికారులు బి.వెంకటరమణ, ఎం.శశిభూషణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ ఛిత్తు

విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోయి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ అధికారులు, పోలీసులు సూచించారు. డ్రగ్స్ వినియోగం తో కలిగే అనర్థాలపై జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు కళాశాలల విద్యార్థులకు ఎస్ఈబీ, పోలీస్ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.బొండపల్లిలోని అక్షర పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గజపతినగరం ఎస్ఈబీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ పి.అప్పారావు, చీపురుపల్లి ఆదిత్య జూనియర్ కళాశాలలో ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు, కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీ, 202 కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్ఐలు వీరజనార్దన్, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

– బొండపల్లి, చీపురుపల్లి, కొత్తవలస



కొత్తవలస: అవగహన కల్పిస్తున్న సీఐ బాలసూర్యారావు



బొండపల్లి: అక్షర పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎస్ఐ సన్యాసినాయుడు

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే భోజనాలను పరిశీలిస్తున్న అధికారి శాంతకుమారి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బి.శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఆమె తనిఖీలు చేశారు. స్టాక్ రికార్డులు, లబ్ధిదారుల వివరాలను, పిల్లల కోసం వండిన వంటలను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గృహ సందర్శన చేసి గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు గురించి వివరించాలని సూచించారు. కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ఆ విధంగా జరిగితే సహించేది లేదన్నారు. సీడీపీఓ డోకుల ఉమాభారతి ఆమె వెంట ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా పాలన



చీపురుపల్లిరూరల్: పథకాల లబ్ధిదారులకు సీఎం జగన్ సందేశ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు



గుర్ల: పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు

చీపురుపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా సాగుతోందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు అన్నారు. కర్లాం గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఏపీఎం రాజశేఖర్, నాయకులు బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, పతివాడ రాజారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

గుర్ల: ఇంటింటికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించా లని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీనాయకులు పొట్నూరు సన్యాసినాయుడు కోరారు. ముద్దాడపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. నాయకులు బెల్లాన బంగారునాయుడు, సారిక గోవింద్, పల్ల సురేష్, రామారావు, తోట తిరుపతిరావు , కెంగువ మధుసూదనరావు, జమ్ము స్వామినాయుడు, మొల్లి అప్పన్న పాల్గొన్నారు.

పక్కాగా లెప్రసీ సర్వే చేపట్టాలి



వైద్యసిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ

కొత్తవలస: గ్రామాల్లో కుష్టు వ్యాధి గ్రస్తుల సర్వేను పక్కాగా నిర్వహించాలని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి గోపాలకృష్ణ వైద్య సిబ్బందికి సూచించారు. లెప్రసీ సర్వేపై పీహెచ్‌సీ ప్రాంగణంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు సర్వే నిర్వహించాలన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి లెప్రసీ అనుమానిత కేసులను గుర్తించి, వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. శరీరంపై రాగి, గోదుమ రంగుల్లో స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధిగా నిర్ధారించవచ్చన్నారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి మందులు వాడితే అంగవైకల్యం రాకుండా చూడవచ్చన్నారు. రెండో వైద్యాధికారి సింహాద్రినాయుడు, పీహెచ్‌ఎస్ జగదాంబ, ఈఓలు నర్సింహరావు తిరుపతిరావు, ఆరోగ్య సహాయకులు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు సర్వీసులు పునరుద్ధరణ

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో 4 బడి బస్సు సర్వీసులను పునరుద్ధరించామని ఎస్.కోట డిపో మేనేజర్ కె.రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తగిన ధ్రువపత్రాలు సమర్పించి బస్‌స్టేషన్‌లో బస్‌పాస్‌లు తీసుకోవాలని సూచించారు. కొండగంగుబూడి, గొల్జాం, ముసిరాం, వావిలపాడు, వేపాడ, ఆనందపురం, బక్కునాయుడుపేట గ్రామాల విద్యార్థులు అంతా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.